క్లుప్తంగా

ప్రతిరోజూ తప్పనిసరిగా ధ్యానం చేయాలి



ధ్యానంలో పాల్గొన్న ప్రశిక్షకుడు, అభ్యాసకులు

అర్వపల్లి : ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ప్రశిక్షకుడు ఎం.వెంకటరంగారావు కోరారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్రమిషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం అర్వపల్లిలోని ధ్యాన కేంద్రంలో యోగా, ధ్యానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆదివారం ఈ కేంద్రంలో ధ్యాన శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, శ్రీలక్ష్మి, ఉష, భవాని, ఉమ, వెన్నెల, సత్యనారాయణ, అనిల్, రామలింగయ్య, రమేష్, వెంకట్, వీరయ్య, సతీష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూర్ (ఎస్) : తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారడంతో గీత కార్మికుడు కిందపడి తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు తండు రాములు రోజు మాదిరిగా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడికి తీవ్ర గాయాలుకావడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీల హాజరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : ఉపాధిహామీ పథకం పనులకు ఇప్పటివరకు ప్రతి ఆదివారం సెలవు ఉండేదని, ఇక నుంచి కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవును రద్దు చేయడం జరిగిందని ఎంపీడీఓ టి.గోపి చెప్పారు. ఆదివారం లోయపల్లిలో గుట్టపై జరుగుతున్న కందకం పనుల ను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రతి ఆదివారం కూడా ఉపాధి పనులకు వెళ్లాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆరె సైదులు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

లింగమంతుల స్వామి ఉత్సవాలకు విరాళం



నాగారంలో ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : నాగారం మండల కేంద్రంలో సోమవారం జరిగే లింగమంతుల స్వామి ఉత్సవాలకు తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ రూ.50,116ల విరాళం పంపించారు. ఆ నగదును ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలో ఆదివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. బస్టాండ్ ఏరియాలో రోడ్లపై వెళ్తున్న వారిపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేసింది. గిలకత్తుల మహేష్, కొయ్యల టిల్లుపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్కను తరమడానికి పలువురు ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేయడానికి వెంబడించింది. పిచ్చికుక్క స్వైర విహారంతో మండల కేంద్రంలో బయటకు వెళ్లడానికి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

మాజీ సర్పంచ్ చక్రయ్యగౌడ్ కుటుంబానికి పరామర్శ

నూతనకల్ : మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్ ఇటీవల హత్యకు గురికావడంతో ఆదివారం మృతుడి కుటుంబాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీ, దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, గునగంటి వెంకన్న, పల్లా వెంకన్న, ఆగిరెడ్డి, మాతంగి వెంకన్న, రాము, శ్రీధర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న తీగల గిరిధర్‌రెడ్డి

నిధులు లేక.. నిర్వహణ సాగక

- రైతు వేదికలకు నెలల తరబడి నిలిచిన నిర్వహణ నిధులు



వట్టిఖమ్మంపహాడ్‌లోని రైతు వేదిక

చివ్వెంల : రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతు వేదికలను నిర్మించారు. కానీ వాటి నిర్వహణకు నిధులు సకాలంలో రావడంలేదు. దీంతో రైతు వేదికల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. రైతువేదికలు దుమ్ము దూళితో కనిపిస్తున్నాయి. సమావేశాలకు ఉన్నత స్థాయి అధికారులు వస్తే మాత్రం రైతు వేదికలను ఉపాధిహామీ కూలీలు,ప్రైవేట్ కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు. ఏఈఓలు పట్టించుకోని చోట రైతు వేదికలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

చివ్వెంల మండలంలో ఇలా..

చివ్వెంల మండల కేంద్రంతోపాటు వట్టిఖమ్మంపహాడ్, గాయంవారి గూడెం, జి.తిర్మలగిరి క్లస్టర్లలో రైతు వేదికలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఒక్కో రైతు వేదికను రూ.22లక్షలతో 2021లో నిర్మించింది. అలాగే వాటికి నిర్వహణ నిధులు కూడా కేటాయిస్తున్నారు. విద్యుత్ బిల్లులకు రూ.1000, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.3000, రైతుల శిక్షణకు రూ.2500, తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్స్‌లు, ఇతర ఖర్చులకు రూ.2000 కేటాయించారు. అయితే ఆ నిధులను 2022 ఆగస్టు వరకే విడుదల చేశారు. ఆ తర్వాత నిర్వహణ నిధుల జాడేలేకుండా పోయింది. ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుంచి నిధులను నిలిపివేయడంతో రైతు వేదికల నిర్వహణ ఏఈఓలకు భారంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

నిధులు రావడం లేదు

గత రెండు సంవత్సరాల నుంచి రైతు వేదికల నిర్వహణకు సంబంధించి నిధులు రావడం లేదు. దీంతో వాటి నిర్వహణ భారంగా మారింది. విద్యుత్ బిల్లులు మాత్రం మేమే చెల్లిస్తున్నాం.

– బి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి, చివ్వెంల

డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలి



సూర్యాపేటలో మినీ ట్యాంక్ బండ్‌పై 2కే రన్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్యాపేట టౌన్: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు పోరాట స్ఫూర్తితో సమాజంలో డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి యువత కలిసికట్టుగా ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 94వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సూర్యాపేట మినీ ట్యాంక్ బండ్‌పై డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని నినదిస్తూ 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్‌ల వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని, ప్రభుత్వాలు స్పందించి వీటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్ జిల్లెపల్లి నరసింహారావు, మురళి, నాని, గణేష్, శ్రీనివాస్, నాగరాజు, హరీష్, శ్రవణ్, గోపి, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సువెన్ ఫార్మా ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సూర్యాపేట : ఉచిత వైద్యశిబిరాన్ని సువెన్ ఫార్మా పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు అన్నారు. ఆదివారం దాసాయిగూడెం గ్రామంలో సువెన్ ఫార్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోషక విలువలు కలిగిన మంచి ఆహారం తీసుకుంటూ.. ఆరోగ్య నియమాలను పాటిస్తే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ రోజుల్లో ఎక్కువ మంది డయాబెటిస్, బీపీ లాంటి జీవనశైలి వ్యాధులతో ఇబ్బంది పడుతుండటం బాధాకరమన్నారు. ఈ శిబిరం ద్వారా వస్రాం తండా, భానుపురి తండా గ్రామాలకు సంబంధించి సుమారు 270 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ బి.వెంకటరమణ, డిప్యూటీ మేనేజర్ సైదులు, పీజే రాయుడు, పీవీ రమణ, బి.కృష్ణ, జీవన్ నాయక్, సునీల్‌రెడ్డి, సువెన్ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



2కే రన్ నిర్వహిస్తున్న వైద్యులు

సూర్యాపేటటౌన్ : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెన్నెల ఆస్పత్రి వైద్యుడు మామిడి నరేష్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూళన దినోత్సవం సందర్భంగా ఆదివారం వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్ మహాత్మా గాంధీ విగ్రహం నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు 2కే రన్ నిర్వహించారు. వెన్నెల ఆస్పత్రి వైద్యుడు నరేష్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సురేష్, సారగండ్ల శ్రీనివాస్, పర్యావరణ ఇంజనీర్ శివప్రసాద్, సురేష్, యోగ గురువు నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు

సూర్యాపేటటౌన్ : మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురు ట్రాక్టర్ల డ్రైవర్లపై సూర్యాపేట రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం కాసరబాద గ్రామానికి చెందిన చింత కిరణ్, డాకూరి బాబు, రాయినిగూడేనికి చెందిన నల్లమేకల నాగరాజు ఆయా గ్రామాల శివారులోని మూసీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు టేకుమట్ల, రాయినిగూడెం, కేటీ అన్నారం, కాసరబాద గ్రామ శివారులో మూసీ వాగులోకి వెళ్లే దారులకు గోతులు తీయించామని, ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

శిథిల భవనం.. అనుక్షణం భయం

- నూతన భవనానికి నోచుకోని అర్వపల్లి పశువైద్యశాల
- నిధులు విడుదలైనా స్థలం కొరతతో ముందుకుసాగని పనులు



శిథిలావస్థలో ఉన్న భవనం

అర్వపల్లి : అర్వపల్లిలోని మండల పశువైద్యశాల పూర్తిగా శిథిలమైంది. భవనాన్ని 50 ఏళ్ల కిందట నిర్మించారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులకు నోచుకోక ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. దీనికి తోడు సూర్యాపేట–జనగామ జాతీయ రహదారి విస్తరణ సందర్భంగా రోడ్డు ఎత్తు పెంచడంతో ఈ ఆస్పత్రి పూర్తిగా లోతట్టుమయం అయ్యింది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం వచ్చినా పశువైద్యశాల ఆవరణ మొత్తం చెరువును తలపిస్తోంది.

నిధులు మంజూరైనా నిష్ప్రయోజనం..

పశు ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో గత ప్రభుత్వ హయాంలో డీఎంఎఫ్ నుంచి కొత్త భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. అయితే భవనానికి ప్రస్తుతం ఉన్న స్థలం చాలదని, సంత స్థలంలో భవనం నిర్మించాలని మండల పరిషత్ సమావేశంలో తీర్మానించారు. కానీ సంత ఆవరణలో స్థలం కేటాయింపు జరగకపోవడంతో నిధులు వెనక్కిపోయాయి. దీంతో పశువైద్యశాలను శిథిలావస్థలో ఉన్న భవనంలోనే కొనసాగించాల్సి వస్తోంది. ఆస్పత్రి సిబ్బంది శిథిలమైన భవనంలో భయం భయంగా విధులు కొనసాగిస్తున్నారు. పశువైద్యశాలకు స్థలాన్ని కేటాయించి నూతన భవనాన్ని నిర్మించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

భవన నిర్మాణం కోసం పోరాడుతున్నాం



అర్వపల్లిలో పశువైద్యశాలకు కొత్తభవనం నిర్మాణం కోసం జీఎంపీఎస్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పోరాడుతున్నాం. మూగ జీవాలకు వైద్యం కోసం వెళ్లినప్పుడు కనీస వసతులు ఉండడంలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే కొత్త భవనాన్ని నిర్మించాలి.

– వజ్జె వినయ్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి

ఉన్నతాధికారులకు నివేదించాం



అర్వపల్లిలోని పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలమై వైద్యసేవలకు అనువుగా లేకుండాపోయింది. ఈ విషయాన్ని గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం. గతంలో నిధులు మంజూరు కాగా స్థలం లేదనే కారణంతో నిర్మించలేదని తెలిసింది. కొత్త భవనాన్ని నిర్మిస్తే వైద్యసేవలకు ఆటంకం ఉండదు.

– అర్జున్, మండల పశువైద్యాధికారి

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి



సూర్యాపేట : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

సూర్యాపేట : భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పూర్వ విద్యార్థి మిత్ర మండలి అధ్యక్షుడు నల్లగుంట్ల అయోధ్య, ప్రధాన కార్యదర్శి బయ్య మల్లికార్జున్ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని పోస్టాఫీస్ చౌరస్తాలో సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ తదితర స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. విద్యార్థులకు భగత్‌సింగ్‌పై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు షేక్ సైదులు, తన్నీరు యాదగిరి, సట్టు వెంకన్న, గుండ్ల కొమరయ్య, చంద్రమౌళి, వీరబోయి భగవాన్, ధ్రువకాంత్, సన్నీ, విక్రమ్, హరిహరన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తిని కొనసాగించాలి

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం, కళాశాలలో ఆదివారం పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు బండి రవి, పీవైఎల్ నాయకులు వీరబోయిన లింగయ్య, రామకృష్ణ, పీడీఎస్‌యూ నాయకులు సంధ్య, మహేశ్వరి, నవ్య, పావని, మానస, మనీషా, శైలజ, అఖిల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సమైక్యతా ర్యాలీ

సూర్యాపేటటౌన్ : భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ప్రగతిశీల, అభ్యుదయ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, లాయర్ల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు ప్రజా సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల త్యాగాల స్ఫూర్తితో ముందుకెళ్తామని అన్నారు.

నూతనకల్ : భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భగత్‌సింగ్ యూత్ క్లబ్ సభ్యులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని యడవెల్లి గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎలిమినేటి కృష్ణప్రశాంత్, బొడ్డు సైదులు, గాజుల సురేందర్, బంటు రామకృష్ణ, గాజుల పరమేష్, బయ్యా నాగరాజు, స్టాలిన్, నర్సయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థి మిత్ర మండలి సభ్యులు



సూర్యాపేటటౌన్ : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెన్‌పహాడ్ : దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలు ఎక్కిన భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకుడు రణపంగ కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఎం, డీవైఎఫ్ఐ, సీఐటీయూల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటీష్ వారు ఉరితీసి చంపారని తెలిపారు. నేటి యువత మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఇరుగు రమేష్, డీవైఎఫ్ఐ మండల నాయకులు రణపంగ అశోక్, రామసైదులు, సందీప్, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్) : తుమ్మల పెన్‌పహాడ్‌లో నివాళులర్పిస్తున్న పీవైఎల్ నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో నేటి యువత ఉద్యమించాలని పీవైఎల్ రాష్ట్ర కోశాధికారి రవి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సానుబోయిన ఉపేందర్ అన్నారు. పీవైఎల్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆదివారం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అవిరె అప్పయ్య, నూకలగిరి ప్రసాద్ రెడ్డి, ఎరుకల నాగరాజు, కుసుకుంట్ల సైదులు, శ్రీను, ప్రతాప్, మధుసూదన్ రెడ్డి, పిట్టల లింగయ్య, నాయిని మల్లయ్య, కనకయ్య, అలుగుబెల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు.



నూతనకల్ : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భగత్‌సింగ్ యూత్ క్లబ్ సభ్యులు



పెన్‌పహాడ్ : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఆత్మకూర్(ఎస్) : ఏపూరులో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : మంద కృష్ణమాదిగ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు అన్నా రు. వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం సంబురాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గుగ్గిళ్ల శాంసన్, గుగ్గిళ్ల పిచ్చయ్య, తిరుమలేష్, దొంగరి సైదులు, అర్తి కేశవులు, మేకల నగేష్, మాతంగి సైదులు, నన్నెపంగు కిరణ్, ఏడుకొండలు, అరవింద్, అంజయ్య, సుధాకర్, అబ్రహాం పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



ఆత్మకూర్ (ఎస్) : రామన్నగూడెం వద్ద ఏటికి అడ్డంగా గుంతలు తవ్విస్తున్న పోలీసులు



పెన్‌పహాడ్ : నాగులపహాడ్ మూసీ వాగు వద్ద..

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూరు మండలంలోని బిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బి.శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం వద్ద ఏటి నుంచి ఇసుక తరలించకుండా గొయ్యి తవ్వించారు. రామన్నగూడేనికి చెందిన బత్తుల విష్ణు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గోపికృష్ణ అన్నారు. ఆదివారం దోసపహాడ్, నాగులపహాడ్ గ్రామాల శివారు నది ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జేసీబీల సహాయంతో కందకాలు తవ్వించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మూసీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే సంబంధిత వ్యక్తులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

మొక్కలను సంరక్షించాలి



వననర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : వననర్సరీలలో పెంచుతున్న మొక్కలను ఎండిపోకుండా ఎప్పటికప్పుడు సంరక్షించాలని ఎంపీడీఓ టి.గోపి కోరారు. ఆదివారం జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని రామన్నగూడెంలోని వననర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, నిర్వాహకులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నాగారం : డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మర్రిపల్లి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడు శ్రీనివాస్‌తో చదువుకున్న 2003 టెన్త్ బ్యాచ్ స్నేహితులు ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.31,000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సురేష్, చంద్రకాంత్, చందర్, రామకృష్ణ, అంజయ్య, లింగయ్య, శ్రీను, రవి, లింగమల్లు, మల్లయ్య, నరేష్, బాలరాజు, ఖాజమ్మ, సునీత, రాములు, వీరయ్య, సైదులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

అర్వపల్లి : కొమ్మాల గ్రామానికి చెందిన పాల్వాయి మధు భార్య మాధవి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతోంది. ఆమెకు వైద్య ఖర్చుల కోసం ఆదివారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంటిగొర్ల శ్రీనివాస్, బాసపోలు శ్రీనివాస్, అవిలేను పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు గండి



కుక్కడంలో ఎస్సారెస్పీ కాలువకు పెట్టిన గండి

మద్దిరాల : కుక్కడం గ్రామంలోని 7ఎల్ ఎస్సారెస్పీ కాలువకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం గండి పెట్టారు. గండి చోట నుంచి నీళ్లు వెళ్తున్నాయి. కాలువకు గండ్లు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే వారబందీ పద్ధతిలో నీరు వదులుతుండడంతో చివరి భూములకు నీరందడం లేదని, దీనికితోడు గండ్లు పెడుతుండడంతో చుక్క నీరు కూడా దక్కడం లేదని దిగువ ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే కాలువకు విపరీతంగా గండ్లు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు స్పందించి గండిని పూడ్చి దిగువకు నీళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సూర్యక్షేత్రంలో సౌరహోమం, ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, ఇంద్రారెడ్డి, కాకులారపు రజిత, అర్చకులు భీంపాండే, శ్రీరాం పాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.